క్లుప్తంగా

నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

వేములపల్లి : గ్రామపంచాయతీ నిధులు దుర్వినియోగం చేస్తే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు తప్పవని ఎంపీఓ జయలలిత అన్నారు. మండలంలోని ఆమనగల్లు గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని గ్రామ ప్రజలు గతంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. డీఎల్‌పీఓ ఆదేశాల మేరకు ఎంపీవో జయలలిత శుక్రవారం ఆమనగల్లు గ్రామపంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పంచాయతీల్లో నిర్వహించిన అభివృద్ధి పనులు, నిధుల దుర్వినియోగం నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా శ్రీనివాస్



మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా మిర్యాలగూడ కోర్టుకు చెందిన న్యాయవాది కంచుకొమ్ముల శ్రీనివాస్‌ను నియమిస్తూ సెక్రటరీ ఆఫ్ గవర్నమెంట్ న్యాయ వ్యవహారాల శాఖ ఆర్.తిరుపతి ఉత్తర్వులను జారీ చేశారు. ఈ ఉత్తర్వులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌కు అందింది. అయితే ఈ కౌన్సిల్‌గా మూడేళ్ల పాటు కొనసాగుతారు. మున్సిపాలిటీకి చెందిన కోర్టు కేసులను వాదించనున్నారు. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా శ్రీనివాస్ నియామకం కావడంపై తోటి న్యాయవాదులు అభినందించారు. తన నియామకానికి సహకరించిన మిర్యాలగూడ ఎమ్మెల్యేల లక్ష్మారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సీఐ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సోమనర్సయ్య

మిర్యాలగూడ అర్బన్ : టూ టౌన్ సీఐగా జె.సోమనర్సయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న నాగార్జున డీఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఆయన స్థానంలో నల్లగొండ సీసీఎస్ లో విధులు నిర్వహిస్తున్న జె. సోమనర్సయ్య బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో పాటు చట్టవ్యతిరేక చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

ఇన్‌చార్జ్ ఈఈగా ఎలమందయ్య



డిండి : ఇరిగేషన్ శాఖ ఇన్‌చార్జ్ ఈఈ(ఎగ్జిక్యూటివ్ ఇంజనీయర్)గా కె. ఎలమందయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈఈగా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌రావు అనారోగ్యంతో లాంగ్ లీవ్ పెట్టడంతో జిల్లా ఉన్నతాధికారులు మాల్ డివిజన్ ఈఈగా పని చేస్తున్న కె.ఎలమందయ్యకు అదనంగా డిండి ఈఈ బాధ్యతలు అప్పజెప్పారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఇరిగేషన్ శాఖా ఈఈ కార్యాలయంలో సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి స్వాగతం పలికారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశా కార్యకర్తల ధర్నా

వేములపల్లి : రాష్ట్రంలో ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు రొండి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వేములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కోడిరెక్క వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న ఇద్దరికి సన్మానం

మిర్యాలగూడ: దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామంలో ఈనెల 11న గుర్తు తెలియని వాహనం ఢీకొని గ్రామానికి చెందిన కుంకునూరి నర్సింహారావు అనే వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు కేసును చేదించడంలో గ్రామంలో పలువురు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడ్డాయని వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించినట్లు చెప్పారు. కేసు చేదనలో కీలకంగా మారిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్న ఇద్దరిని ఆయన సన్మానించారు.

భగత్‌సింగ్ ఆశయాలను సాధించాలి

మిర్యాలగూడ అర్బన్ : భగత్‌సింగ్ ఆశయాలను సాధించాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రవి నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 94వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బావండ్ల పాండు, దేశీరాం నాయక్, సాంబానాయక్, పతాని శ్రీను, సైదానాయక్, జగన్, తరుణ్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటితొట్లు

- తాగునీటికి అల్లాడుతున్న జీవాలు
- నిర్వహణ మరిచిన అధికారులు
- వినియోగంలోకి తీసుకురావాలంటున్న ప్రజలు


నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి


శిథిలావస్థల్లో ఉన్న నీటితొట్టి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : భానుడి భగభగలతో ఎండవేడి పెరుగుతోంది. పశువులు, మూగజీవాల దాహార్తిని తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. గతంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధులతో ప్రభుత్వం రూ. 12వేలతో గ్రామాల్లో పశువుల తాగునీటి కోసం నీటి తొట్లు నిర్మించింది. నీటి సౌకర్యం ఉన్న ట్యాంకులు, పబ్లిక్ ట్యాపుల వద్ద తొట్ల ను ఏర్పాటు చేసింది. కానీ వాటిని సక్రమంగా వినియోగించకపోవడంతో పాటు నీటి తొట్ల నిర్వహణను పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో పశువులు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి.

నిర్వాహణ లోపంతో శిథిలావస్థలకు

తిరుమలగిరి(సాగర్) మండలంలో నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటుకు ముందు ఉన్న 15 గ్రామ పంచాయతీల్లో ఈ నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు. వీటి నిర్వాహణను స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థలకు చేరాయి. పశువుల సంఖ్య ఎక్కువ ఉన్న చోట ఒక్కో గ్రామానికి మూడు, నాలుగు తొట్ల నిర్మాణాలు చేపట్టారు. కానీ ఏర్పాటు చేసిన సంవత్సరం పాటు నీటి తొట్ల నిర్వహణ భాగానే సాగిన ఆ తరువాత వీటిని పట్టించుకున్న నాథుడే కరువవ్వడంతో ప్రస్తుతం అవి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో మూగ జీవాలు తాగునీటికి అల్లాడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి గ్రామాల్లో ఉన్న నీటి తొట్లను వినియోగంలోకి తీసుకురావాలని పాడి రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



గ్రామాల్లో ఏర్పాటు చేసిన నీటి తొట్లను ఉపయోగంలోకి తీసుకువచ్చి నీరు ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలి. నిరూపయోగంగా ఉన్న నీటి తొట్లకు మరమ్మతులు చేపట్టాలి. పశువులకు తాగునీరు అందేలా అధికారులు చూడాలి

\- మెండె రాములు, పాడిరైతు

అధికారులు దృష్టి సారించాలి



పశువుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి తొట్లపై అధికారులు దృష్టి సారించాలి. వేసవిలో తాగునీటికి మూగజీవాలు ఇబ్బందులు పడకుండా చూడాలి. గ్రామాల్లో పశువుల కోసం తాగునీటి నీటి తొట్లను ఏర్పాటు చేయాలి.

\- పి. సైదులు, పాడిరైతు

పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం

- డీఎస్పీ రాజశేఖర్‌రాజు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి


పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న డీఎస్పీ కె.రాజశేఖర్ రాజు, మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : పుస్తక పఠనంతోనే విషయ పరిజ్ఞానం అందుతుందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మిర్యాలగూడ డీఎస్పి కె.రాజశేఖర రాజు అన్నారు. స్థానిక ఎన్ఎస్పీ క్యాంపులో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడారు. గతంలో మేధావులు పుస్తకాలను చదివేవారని వాటి ద్వారా నేర్చుకున్న విషయాలను ప్రజలకు వివరించి చైతన్య పరిచేవారన్నారు. ప్రస్తుతం సోషల్‌మీడియా వచ్చాక పుస్తక పఠనం మరిచిపోయారని గూగుల్ యాప్ ద్వారా అన్ని విషయాలను క్లుప్తంగా తెలుసుకుంటున్నారని దాని ద్వారా పూర్తి సమాచారం తెలుసుకోలేక పోతున్నారని తెలిపారు. పుస్తకాల్లోనే పూర్తి సమాచారం ఉంటుందని, చిన్నారుల నుంచి మొదలుకొని వృద్ధుల వరకు ఉపయోగపడే పుస్తకాలు లభిస్తున్నాయన్నారు. యువకులకు, నిరుద్యోగులకు ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రజలు ఈ ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లుగౌతంరెడ్డి, మంగారెడ్డి, పాండు, పరశురాములు, ఎండీ.అంజద్, లక్ష్మీనారాయణ, జాడి రాజు, కిరణ్మయి, మాధవరెడ్డి, . ఎండీ.అయూబ్, శ్రీనివాస్‌రెడ్డి, వాడపల్లి రమేష్, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులు చేస్తే కఠిన చర్యలు


విచారణ చేస్తున్న ఏఎస్పీ మౌనిక

పెద్దఅడిశర్లపల్లి : ఎస్సీ, ఎస్టీలపై దాడులు చేస్తే కఠిన చర్యలుంటాయని దేవరకొండ ఏఎస్పీ మౌనిక హెచ్చరించారు. శుక్రవారం రాత్రి మండలంలోని నర్లెంగ తండాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు విచారణలో భాగంగా సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు పూర్వపరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా ఎస్సీ ఎస్టీలను కులం పేరుతో దూషించినా, దాడులు జరిపినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట ఎస్ఐ నర్సింహులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఆస్తి పన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించండి

- సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్


పన్ను చెల్లించని పెట్రోల్ బంక్‌ను సీజ్ చేస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

మిర్యాలగూడ : ప్రజలు ఆస్తి పన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణం అభివృద్ధి చెందాలంటే పట్టణ ప్రజలందరూ ఆస్తి పన్ను, నీటి బకాయిలు ఈనెల 31లోగా తప్పకుండా చెల్లించాలన్నారు. 15వ ఫైనాన్స్ కింద పట్టణం అభివృద్ధి చెందాలంటే ఆస్తి పన్ను గతేడాది కంటే ఈ ఏడాది పదిశాతం ఎక్కువగా వసూలు చేస్తేనే 15వ ఫైనాన్స్ నిధులు వస్తాయని లేనట్లయితే 15వ ఫైనాన్స్ నిధులు ఆగిపోయే అవకాశం ఉందన్నారు. గత సంవత్సరం మిర్యాలగూడలో రూ.9కోట్ల పన్నులు వసూలు కాగా ప్రస్తుత ఏడాదిలో కేవలం రూ.7కోట్ల వరకే వసూలైనట్లు తెలిపారు. మిగతా రూ.3కోట్లను వసూలు చేసినట్లయితే 15వ ఫైనాన్స్ నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పట్టణాభివృద్ధికి సహకరిస్తేనే అన్ని రకాల సదుపాయాలు కల్పించవచ్చని అన్నారు. పట్టణంలోని దుకాణాలు, థియేటర్లు, హోటళ్లు, కమర్షియల్ బిల్డింగ్స్ యజమానులు ఇప్పటివరకు వంద మందికి పైగా రూ.3లక్షల నుంచి రూ.7లక్షల వరకు ఆస్తి పన్ను బకాయిలు కట్టలేదని వారికి రెడ్ నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. రెడ్ నోటీసు దారులు వెంటనే పన్ను చెల్లించాలని లేనట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ హరిబాబు ఉన్నారు.

ఒక్కరోజే రూ.14లక్షల ఆస్తి పన్ను వసూలు

పట్టణంలో ఆస్తి పన్ను వసూలు ముమ్మరం చేశారు. శుక్రవారం సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 9 ఆస్తులను సీజ్ చేసినట్లు కమిషనర్ ఎండీ.యూసుఫ్ తెలిపారు. ఒక్కరోజే రూ.14లక్షల ఆస్తి పన్ను వసూలు చేసినట్లు తెలిపారు. పట్టణంలో బకాయిగా ఎక్కువగా ఉన్న వారి విద్యుత్ సరఫరా, నల్లా కనెక్షన్లు, ఇళ్లకు తాళాలు వేసినట్లు తెలిపారు. ఆస్తి పన్ను వసూలు కోసం ప్రత్యేకంగా టీంను ఏర్పాటు చేశామని, అందులో సబ్ కలెక్టర్, తహసీల్దార్, కమీషనర్, ఎంపీడీఓ, డీఎల్‌పీఓ, సీఐతోపాటు అధికారులు బృందంలో ఉంటారని అన్నారు. ఈనెలాఖరులోగా రూ.3కోట్ల పన్ను వసూలు చేసేందుకు లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, మున్సిపల్ డీఈ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

పెద్దవూర : మాయమాటలతో కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని శిర్సనగండ్ల గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో పోరుబాట సర్వే నిర్వహించి మాట్లాడారు. గ్రామం నుంచి చిన్నగూడెం వెళ్లే దారి కనీసం నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దోరెపల్లి మల్లయ్య, తుడుం వెంకటయ్య, సైదులు, వెంకటయ్య, శంకరమ్మ, గిరి, నాగయ్య పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారి

గుర్రంపోడు : పోషక ఆహారంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ అధికారి మనోహర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పోలు జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రాంలో భాగంగా పోషణ్ మేళ కార్యకరమాన్ని నిర్వహించి ఆరోగ్య స్టాల్ ఏర్పాటు చేశారు. సామాజిక వయోజన మహిళలకు , కౌమార బాలికలకు అయోడిన్ ఉపయోగాలను , బలవర్ధకమైన ఆహార అలవాట్ల గురించి అవగాహన కల్పించారు. అనతంతరం ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ యాదగిరి, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఐజీడీ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రిటైర్డ్ ఉద్యోగుల ప్రతిభ


రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ఇటీవల కోదాడలో తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో మిర్యాలగూడకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు ప్రతిభను కనబరిచారు. ఈ రాష్ట్ర స్థాయి క్రీడల్లో పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి దండ పిచ్చిరెడ్డి వాకింగ్ రేస్‌లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించాడు. అదే విధంగా చెస్ పోటీలో సిరిగిరి వెంకట్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానాన్ని సాధించాడు. ప్రతిభను కనబరిచిన వారికి బహుమతులు కూడా అందించారు. రాష్ట్ర స్థాయి పోటీలో ప్రతిభను కనబరిచిన రిటైర్డ్ ఉద్యోగులను శుక్రవారం మిర్యాలగూడ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అభినందించారు. అభినందించిన వారిలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బంటు శేషు, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగులు భూపతిరెడ్డి, ఏడుకొండలు, దొంతిరెడ్డి సంజీవరెడ్డి, బీరవోలు కృష్ణారెడ్డి, పగిళ్ల రాములు, కోటిరెడ్డి, దామోదరాచారి తదితరులున్నారు.

సర్వే వాయిదాపై గ్రామస్తుల ఆగ్రహం

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా


ధర్నా చేస్తున్న గ్రామస్తులు

గుర్రంపోడు : ఈ నెల 21 నుంచి మండలంలోని కొప్పోలు గ్రామంలో అన్యాక్రాంతమైన ఆలయ భూముల సర్వే జరగాల్సి ఉండగా అనూహ్యంగా వాయిదా పడటంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కబ్జాదారుల ఒత్తిడితోనే సర్వేను వాయిదా వేశారని వెంటనే సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా ఉన్నతాధికారుల సూచనల మేరకు సర్వేను తాత్కాలికంగా వాయిదా వేశామని, ఆతర్వాత ఈ నెల 30నుంచి సర్వే చేపడతామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఫరీదుద్దీన్ గ్రామస్తులకు తెలిపారు.అక్కడికి చేరుకున్న ఎస్ఐ పసుపులేటి మధు మాట్లాడుతూ సర్వేకు కొద్ది రోజులు వేచి చూడాలని, అందరూ సహకరించాలని కోరారు. అనంతరం గ్రామస్తులు త్వరగా సర్వే చేసి దేవాలయ భూములకు హద్దు రాళ్లను పాతించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ అయితగోని పరమేష్ గౌడ్, బైరు బలరాములు, లక్ష్మీనారి, నీలం సైదులు, అనిల్, నర్సింహ్మ, రవి, నాగరాజు, రవి, నర్సింహ్మ, శంకర్, రమేష్, పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం


గుర్రంపోడు : పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి


మిర్యాలగూడ : పరీక్ష కేంద్రం వద్ద వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్


దేవరకొండ : పరీక్షా కేంద్రం వద్ద రూం నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

మిర్యాలగూడ : పదవ తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభం కాగా మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగాయి. పట్టణ వ్యాప్తంగా 12 పరీక్షా కేంద్రాలోల 2737 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 2732 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఆయా కేంద్రాల్లో ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ తీరును స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ తనిఖీ చేసిఆశా వర్కర్లకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ హరిబాబు, ఎంఈఓ బాలునాయక్, చీఫ్ సూపరింటెండెంట్ ధర్మానాయక్, డిపార్ట్‌మెంటల్ అధికారి తావురియా, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం కలెక్టర్ పరిశీలన

గుర్రంపోడు : మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదోతరగతి పరీక్షాకేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా సందర్శించారు. కొందరు విద్యార్థుల మాస్కులు ధరించి ఉండటాన్ని గమనించిన కలెక్టర్ విద్యార్థులకు సొంతంగా మాస్కులు తెచ్చుకోవడాన్ని అనుమతించకుండా అవసరమైన వారికి మాస్కులు తెప్పించి పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. 142 మంది విద్యార్థులకుగాను నూరు శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, పరీక్షా ఏర్పాట్లను మండల విద్యాధికారి నోముల యాదగిరి, చీఫ్ సూపరిండెంట్ శేఖర్‌లు కలెక్టర్‌కు వివరించారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు, కలెక్టర్ వెంట డీఈఓ. బిక్షపతి ఉన్నారు.

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షా కేంద్రంలో మొత్తం 95మంది విద్యార్థులకు గాను 95 మంది విద్యార్థులు హాజరయ్యారైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ వెంకట్‌రెడ్డి, డిపార్ట్‌మెంట్ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

హాలియా : అనుముల మండలంలోని హాలియా పట్టణంలో శుక్రవారం నిర్వహించిన పదవ తరగతి పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో 688 మంది విద్యార్థులకు గాను 688 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఎంఈఓ కృష్ణమూర్తి, ఫ్లయింగ్ స్క్వాడ్ నర్సింహ్మా సందర్శించి పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పరీక్షకు హాజరయ్యే ముందు తొలి రోజు విద్యార్థులు స్థానిక శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి పదవ తరగతిలో వార్షిక పరీక్షలో పాసయ్యేలా చూడు స్వామి అని స్వామి వారిని ప్రార్థించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అనుముల మండలశాఖ ఆధ్వర్యం లో పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఉచితంగా కూల్ వాటర్ పంపిణీ చేశారు.

పెద్దవూరలో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు

పెద్దవూర : పదవ తరగతి వార్షిక పరీక్షలు మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగాయి. పెద్దవూర మండలంలో మొత్తం 698 మందికి 696మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ తరి రాములు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

నాగార్జునసాగర్ : నందికొండలోని పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు పూర్తి స్థాయిలో హాజరయ్యారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సెంటర్‌లో 117కుగాను వందశాతం,సెయింట్ జోసెఫ్ పరీక్ష కేంద్రంలో 200మంది విద్యార్థులకు గాను పూర్తి స్థాయిలో హాజరైనట్లుగా అధికారులు తెలిపారు.

త్రిపురారంలో నలుగురు..

త్రిపురారం : మండలంలో పదో తరగతి పరీక్షలు శుక్రవారం మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 188మంది విద్యార్థులు, టీజీ మోడల్ స్కూల్‌లో 171 మంది విద్యార్థులు హజరు కాగా నలుగురు విద్యార్థులు గైరహజరైనట్లు త్రిపురారం ఎంఈఓ రమావత్ రవి తెలిపారు.

దేవరకొండలో ఒకరు..

దేవరకొండ : పదో తరగతి పరీక్షలు దేవరకొండలో శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. దేవరకొండ మండల పరిధిలో మొత్తం 6 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 1238మంది విద్యార్థులకు గాను ఒకరు పరీక్షకు గైర్హాజరైనట్లు ఎంఈఓ మాత్యనాయక్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమల్లో ఉంచారు.

పెద్దఅడిశర్లపల్లి : పదో తరగతి పరీక్షలు మండలంలో తొలి రోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో మొత్తం 315 మంది విద్యార్థలకు వంద శాతం హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఎస్ఐ నర్సింహులు పరిశీలించారు.

కొండమల్లేపల్లి : పదో తరగతి వార్షిక పరీక్షలకు శుక్రవారం మొత్తం 763 మందికి విద్యార్థులకు గాను 761 మంది హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల నిర్వాహకులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలులో ఉంచారు.

మద్యం తాగి నడిరోడ్డుపై హల్‌చల్


గుర్రంపోడులో నడిరోడ్డుపై పడుకున్న మందుబాబు

గుర్రంపోడు: గుర్రంపోడు మండల కేంద్రంలో శుక్రవారం మద్యం తాగిన ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. ప్రధాన రహదారిపై అడ్డంగా పడుకుని వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించాడు. కొద్దిసేపటి తర్వాత అక్కడ గుమికూడిన వారు ఆ వ్యక్తిని పక్కకు జరపడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


కూతాటి మురళి

పెద్దవూర : మండలంలోని పులిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కూతాటి మురళి ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఎంప్లాయీస్ జాతీయ స్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు న్యూఢిల్లీలోని వినయ్ మార్గ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఖో-ఖో పోటీల్లో తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ ఎంప్లాయీస్ పురుషుల విభాగంలో ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. గత నెలలో హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి ఖో-ఖో ఫైనల్ సెలక్షన్‌లో నల్లగొండ జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించి అత్యుత్తమ ప్రతిభ కనపర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక పట్ల మండల విద్యాధికారి తరి రాములు, పాఠశాల హెచ్ఎం సుదర్శన్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

‘విజయవిహార్’ ముస్తాబు





హైదరాబాద్‌లో నిర్వహించే మిస్ వరల్డ్ పోటీలకు హాజరయ్యే అందాలభామలు మే 12న నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించనున్నారు. వారి రాక కోసం స్థానిక విజయవిహార్ అతిథిగృహాన్ని ముస్తాబు చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో గదులను తీర్చిదిద్దుతున్నారు.

బడ్జెట్ ప్రతులు దహనం

కొండమల్లేపల్లి : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి సముచిత కేటాయింపులు చేయలేదని పేర్కొంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తెలంగాణ టెక్నికల్ రాష్ట్ర కోకన్వీనర్ రమావత్ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం 7.57శాతం మాత్రమే కేటాయించారని, ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో నిధులు పెంచాలని లేకపోతే పెద్ద ఎత్తు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్, శ్రీరాం, సాయిరాం, శరత్, విజయ్, కల్యాణ్, శివాజీ, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.